ప్రజాశక్తి
మంగళవారం 2 మే 2023
5
అల్లూరి సీతారామరాజు



ఆసుపత్రిని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిల్లా ఆసుపత్రిని సోమవారం ప్రపంచ బ్యాంకు బృందం సందర్శించింది. ఆసుపత్రిలోని వార్డులను, సికిల్ సెల్ ఎనీమియా ల్యాబ్‌ను పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు. బృందం వెంట డిఎం అండ్ హెచ్ఓ జమాల్ బాషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.కృష్ణారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ శంకర్ ప్రసాద్ ఉన్నారు.



రోగులను సమస్యలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

ఘనంగా మేడే వేడుకలు

జోరు వానలోనూ వాడవాడలా ఎర్రజెండా రెపరెపలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో సోమవారం మే డే ను కార్మిక వర్గాలు ఘనంగా నిర్వహించాయి. సిఐటియు ఆధ్వర్యంలో వాడవాడలా కార్మికులు ఎర్ర జెండా ఎగురవేసి కార్మిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అల్లూరి జిల్లా అంతటా ఉదయాన్నే తెల్లారేసరికి జోరు వాన మొదలైంది. అయినప్పటికీ కార్మికులంతా కదిలి వచ్చి తమ తమ ఆవాసాల్లో ఎర్ర జెండా ఎగురవేసి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. జిల్లాలో పలుచోట్ల కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కేంద్రం పాడేరులో సీఐటీయూ ఆధ్వర్యంలో గిరిజన సహకార సంస్థ(జిసిసి), గ్రామపంచాయతీ కార్యాలయం, జిల్లా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్ వద్ద ఆయా రంగాల కార్మికులు ఎర్రజెండా ఎగరవేశారు. సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో దోపిడీ లేని సమాజం నిర్మాణానికి కార్మిక వర్గాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ పాలనలో కార్మిక హక్కులు, చట్టాలను కాల రాస్తున్నారని, దళితులు, గిరిజనులపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొస్తూ మోడీ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న కార్మికుల హక్కులు, చట్టాల్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ఆయన దుయ్య బట్టారు. రాష్ట్రంలో కార్మికులకు ఇచ్చిన హామీని జగన్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం పాదయాత్రలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26000 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, వివిధ కార్మిక కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల నాయకులు శెట్టి నాగరాజు, గౌరీ, వై మంగమ్మ, వంతల దాస్, లక్ష్మణ్, సంజీవరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో జెండాను ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు, కార్మికులు

రంపచోడవరం :మేడే స్ఫూర్తితో కేంద్రంలోని మోడీ ప్రభుత్వ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రంపచోడవరంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వెంకట్ మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసి 8 గంటల పని విధానాన్ని సాధించిన రోజు అని తెలిపారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను, హక్కులను నేడు కేంద్రంలో మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని విమర్శించారు. కార్మికులను యజమానులకు కట్టుబానిసలను చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని తెలిపారు. మరో వైపు ప్రభుత్వ రంగ సంస్థలను అంబాని, అదాని వంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు పూపుకుంటుందని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవటానికి రంపచోడవరం జిల్లాలోనూ ఉద్యమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి తీగల శ్రీనివాస్, అంగన్వాడీ జిల్లా నాయకురాలు కారం రామలక్ష్మి, మంగమ్మ, సింగారమ్మ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న వెంకట్, కార్మికులు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్

4న బహిరంగ సభను జయప్రదం చేయాలి

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-చింతూరు

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ కేంద్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ప్రచార భేరి ముగింపు సందర్భంగా ఈ నెల 4న చింతూరులో జరుగు బహిరంగ సభకు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. చింతూరులో సోమవారం జరిగిన సిపిఎం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పచ్చి మతోన్మాద విధానాలను అమలు చేస్తూ లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందని తెలిపారు. దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని, వీటిపై ప్రజలకు ప్రశ్నించే ఆలోచన శక్తిని నశింపజేసే విధంగా కార్పొరేట్ మతోన్మాద విధానాలను ముందుకు తెస్తుందన్నారు. దేశ సంపదను పెంచుతామని, నిరుద్యోగం రూపుమాపుతామని, ప్రజలకు ధరలు అందుబాటులో ఉండేందుకు మార్కెట్ నియంత్రణ చేస్తామని, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని ఎన్నికల్లో వాగ్దానాలు చేసిన మోడీ బిజెపి ప్రభుత్వం ఎన్నికల అనంతరం ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందని విమర్శించారు. ఏప్రిల్ 14 నుండి 30 వరకు సిపిఎం, సిపిఐ ప్రచార భేరి ద్వారా గ్రామాల్లో మోడీ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో ప్రచారం చేశామన్నారు. ఈ నెల 4న జరగనున్న బహిరంగ సభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, సిపిఐ నాయకులు రావూరి వెంకయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. ఈ బహిరంగ సభకు నాలుగు మండలాల నుండి సిపిఎం, సిపిఐ శ్రేణులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు కుంజా, సీతారామయ్య, కార్యదర్శి సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, మొట్టమ రాజయ్య, పోడియం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: మ్యుటేషన్ల ప్రక్రియను జాప్యం చేయకుండా ఈనెల 3వ తేదీలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఆ తర్వాత మ్యుటేషన్లు పెండింగ్ ఉంటే ఉపేక్షించనని హెచ్చరించారు. జిల్లాలోని 22 మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూముల రీసర్వే, మ్యుటేషన్లు, పివిటిజి ఓటర్ల నమోదు, ఫారం 6 సేకరణ, ఎస్సైన్మెంట్ భూముల నివేదికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌరులకు సత్వర సేవలందించాలని ఆదేశించారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు, భూముల మ్యుటేషన్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే లక్ష్యాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని చెప్పారు. వెక్టరైజేషన్ ఏ మేరకు పూర్తి చేసారో విఆర్ ఓలు, సర్వేయర్లతో తహశీల్దార్లు సమీక్షించాలని స్పష్టం చేసారు. విఆర్ఓలు రీ సర్వే డేటా ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు, విఆర్ఓలు పనితీరు మెరుగుపడాలన్నారు. ఉదాసీనంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రీ సర్వే, మ్యుటేషన్ల ప్రక్రియలో నాణ్యతలు పాటించాలన్నారు. జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లు ప్రతీ రోజు తహశీల్దారులతో సమావేశ మవ్వాలన్నారు. ఎస్సైన్మెంటు భూముల సేకరణ నివేదికలను స్థానిక శాసన సభ్యులకు అందజేసి వివరించాలని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, పాడేరు, రంప చోడవరం ఐటిడిఏ పి.ఓలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, డిఆర్ఓ పి.అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై. మోహనరావు, సర్వే ఇన్స్పెక్టర్ ఎస్.నాగేశ్వరరావు, 22 మండలాల తహశీల్దారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్రజాశక్తి-పాడేరు:గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో పాడేరు, రంపచోడవంద, చింతూరు డివిజన్ల పరిధిలోని గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాలో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వివిధ దశలలో నిర్మాణం జరిగిన గృహాలకు రూ.12 కోట్ల 25 బిల్లును ప్రభుత్వం గత వారం జమ వేసిందని పేర్కొన్నారు. మరో రూ.35 కోట్ల బిల్లులు అప్లోడ్ చేయడం జరిగిందన్నారు. లబ్దిదారులతో సమావేశాలు పెట్టి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు లక్ష్యాలు నిర్దేశించి ఏకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాకు 17,149 ఇళ్లు మంజూరయ్యాయని 15,105 మంది లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించారని చెప్పారు. వెలుగు ఎంపిలతో సమావేశాలు నిర్వహించి బ్యాంకు అధికారులతో మాట్లాడి ఎస్‌హెచ్‌జి నుండి రూ.35 వేల రుణాలు అందించి గృహ నిర్మాణాలకు ఆర్థిక తోడ్పాటు అందించాలన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించక పోవడంపై ఆరా తీసారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణశాఖ ఇన్చార్జి పిడి బి.బాలు, రంపచోడవరం ఇఇ నాగేశ్వరరావు, అరకు వ్యాలీ డిఇ మోహన రావు, ఎటపాక డిఇ మూర్తి, 22 మండలాల ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

కొండబాబు, సత్యనారాయణ వర్ధంతి సభలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యులు, సిపిఐ నాయకులు సుర్ల కొండబాబు ద్వితీయ వర్ధంతి ఆయన స్వగ్రామమైన వైఎన్ పాకలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పెదమాకవరం పంచాయతీ రామరాజుపాలెంలో సిపిఐ నాయకులు సిగ్గే సత్యనారాయణ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో సిపిఐ మండల కార్యదర్శి ఇరువాడ దేవుడు, పార్టీ నాయకులు ఎంవివి సత్యనారాయణ, పాంగి పోలయ్య, వియ్యపు నానాజీ, గుమ్మా రాంబాబు, కుందేరి లోవరాజు, లోకవరపు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంగరాజు, సర్పంచులు

అక్రమ కట్టడాలను కూల్చి వేయాలి

జెడ్‌పిటిసి గంగరాజు, సర్పంచులు డిమాండ్

ప్రజాశక్తి - అనంతగిరి:1/70 వంటి చట్టాలను తుంగలో తొక్కి అక్రమంగా నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తక్షణమే కుల్చి వేయాలని స్థానిక జెడ్పిటిసి గంగరాజు, చిలకలగెడ్డ సర్పంచ్ మజ్జి. అప్పారావు, టోకూరు సర్పంచ్ కె.మొస్యలు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ విఒపి ఆర్‌డి మల్లేశ్వరరావుకు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చిలకలగడ్డ పంచాయతీ గ్రామంలో గిరిజన నేతురులకు గిరిజన చట్టాలను, హక్కులను లెక్క చేయకుండా రాత్రి సమయంలో ఇంటి శ్లాబ్ వేసారన్నారు పంచాయతీ అధికారులు గిరిజనేతురాలికి ఇల్లు కట్టుకున్నందుకు అనుమతులు ఏమైనా ఇచ్చారా అని అధికారులను ప్రశ్నించారు. పనులు చేస్తున్నప్పుడు వీఆర్వో, సెక్రటరీ ఎందుకు నిలుపుదల చేయలేదని నిలదీశారు.ఆమెపై రెవిన్యూ అధికారులు ఎల్‌టిఆర్ కేసు నమోదు చేయాలని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.


అలాగే తహశిల్దార్ కార్యాలయం సమీపంలోని వైయస్సార్ వీధిలో గిరిజనేతురుడైన సాయి నిర్మించుకుంటున్న అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని జనసేన మండల ప్రతినిధి చిట్టం .మురళి కోరారు. తహసిల్దార్ రాంబాయిను కలిసి లిఖితపూర్వకంగా సోమవారం ఫిర్యాదు చేశారు. చట్టాలను, హక్కులను తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి. దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్‌పిగా ధీరజ్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: 2020 బ్యాచ్ కి చెందిన ఆంధ్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి ధీరజ్ పాడేరు ఏఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆరు నెలలు గ్రేహౌండ్స్ లో పని చేసిన ఆయన... మొదటి పోస్టింగ్ పాడేరు ఎఎస్‌పిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ఏజెన్సీలో ప్రజలకు భద్రత కల్పిస్తానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలన్నారు. ఆయన ముందుగా పాడేరు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంను సందర్శించారు.

ఇసుక వాహనం బోల్తా

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని తీగలవలస పంచాయతీ గారుడపల్లి గ్రామ సమీపంలో ఇసుక వాహన బోల్తా పడింది. సోమవారం తెల్లవారుజామున ఇసుక లోడ్ తో వెళ్తూ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మంగ బందా గ్రామ నుంచి ఇసుక లోడ్ చేసుకొని తెల్లవారుజామున 4 గంటలకు వెళుతుండగా వాస్తు గరుడపల్లి సమీపం వద్ద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ గాయపడ్డారు.డ్రైవర్ నిద్రమత్తే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.




బోల్తా పడిన వాహనం

ఏజెన్సీలో భారీ వర్షం

విద్యుత్, బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్‌కు అంతరాయం



పెదబయలులో కురుస్తున్న భారీ వర్షం



అరకు ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అల్పపీడనం ప్రభావంతో రాజవొమ్మంగి మండలంలోని సోమవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుండి వర్షం పడడంతో మండలవాసులు ఎక్కువమంది ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షానికి తోడు ఈదురు గాలులు తోడు కావడంతో విద్యుత్తుకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మన్యంలో ఎండలు మండుతున్న నేపథ్యంలో సోమవారం కురిసిన వర్షానికి మండలవాసులు ఉపశమనం పొందారు.

కొయ్యూరు : కొయ్యూరు, దాని పరిసర గ్రామాలలో సోమవారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వర్షం మొదలైన దగ్గర నుండి విద్యుత్ ఆగిపోయింది. అనంతరం బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ కూడా పూర్తిగా ఆగిపోవడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో సోమవారం ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఏకధాటిగా కుండపోత వర్షం కురిసింది. గత రెండు రోజుల నుంచి అడపాదడపా చిన్నపాటి వర్షాలు కురుస్తుండగా, సోమవారం భారీ వర్షం కురవడంతో సీలేరు పరిసర ప్రాంతాల్లో చల్లటి వాతావరణం నెలకొంది. దారకొండ దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో వర్షాలు అధికంగా పడడంతో గిరిజన రైతుల్లో ఆనందం వెల్లువెరిసింది. తొలకరి వర్షాలు పోడు వ్యవసాయానికి ఎంతో అనువుగా ఉంటాయని గిరిజనులు అభిప్రాయపడ్డారు. పసుపు సాగు చేసుకోవడానికి అనువైన వాతావరణమని సంతోషాన్ని వెలబుచ్చారు.

డుంబ్రిగూడ : మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షం కురిసింది. వర్షం కారణంగా మండలంలోని గిరిజనులు బయటకు రాకుండా ఇళ్ళకే పరిమితం అయ్యారు. మండల కేంద్రంలో వీధి కాలువలు, రోడ్లన్నీ జలమయంగా మారాయి. వేసవిలో సూర్య ప్రతాపానికి, ఉక్క పోతకు గురవుతున్న గిరిజనులకు ఈ వర్షం ఎంతో ఉపశమనం కల్పించింది.

పెదబయలురూరల్ : మండల కేంద్రంలో వాతావరణంలో ఒక్కసారి మార్పు చోటు చేసుకుంది. కుండపోత వర్షం కురవటంతో వారపు సంత బోసి పోయింది. దీంతో వ్యాపారస్తులు అవస్థలు పడ్డారు. మారుమూల ప్రాంతాలకు చెందిన ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

హుకుంపేట : మండల కేంద్రంలో ఎడతెరిపి లేకుండా జోరుగా వర్షం కురిసింది. ఉదయం ఏడు గంటల నుంచి రెండు గంటల వరకు కుండపోత వర్షం కురవడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అరకులోయ రూరల్ : మండలంలోని వివిధ ప్రాంతంలో సోమవారం ఉదయం 7 గంటల నుండి 12గంటల వరకు ఏకధాటిగా భారీ కుండ పోత వర్షం కురిసింది. దీంతో, రాకపోకలు స్తంభించాయి. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో పలు ఇబ్బందులు పడ్డారు. అరకులోయలో నేటి నుండి ప్రారంభం కానున్న వెంకటేశ్వర స్వామి మహోత్సవం ఉత్సవాలకు వచ్చిన ప్రజలు వర్షంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు.



సీలేరులో...

పాడేరు టౌన్ : అల్లూరి జిల్లా మన్యంలో భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరు, పరిసర ప్రాంతాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోతగా వర్షం కురిసింది. దీంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగించారు. రోడ్లన్నీ జలమయం కాగా, పంట పొలాల్లో నీరు చేరింది.

గ్యాస్ గొడౌన్ రోడ్డు బురదమయం

రంపచోడవరం : రంపచోడవరంలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని గ్యాస్ గొడౌన్ రోడ్డు బురదగా మారింది. రంపచోడవరం మండలం చుట్టు పక్కల నుండి సోమవారం గ్యాస్ తీసుకోవడానికి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇప్పుడే కాదు వర్షం ఎప్పుడు కురిసిన ఇదే పరిస్థితి అని, వర్షా కాలంలో అయితే నానా అవస్థలు పడాలి వస్తోందని గ్యాస్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారురులు స్పందించి మెయిన్ రోడ్డు నుండి గ్యాస్ గొడౌన్ వరకు రోడ్డు వేయాలని కోరుతున్నారు.



బురదగా ఉన్న గ్యాస్ గొడౌన్ రోడ్డు

వర్షంతో నిలిచిన క్రికెట్ పోటీలు

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో నిర్వహిస్తున్న మారెమ్మ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారం ఉదయం భారీ వర్షం కురవడంతో నిలిచిపోయాయి. మంగళవారం యథావిధిగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని యంగ్ ప్లేయర్స్ అసోసియేషన్ నాయకులు శ్యామ్ సన్ (బుజ్జి) తెలిపారు. ఈ పోటీలు శనివారం ప్రారంభం కాగా, ఆదివారం కూడా కొనసాగాయని, మంగళవారం వాతావరణం అనుకూలంగా ఉంటే పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



రోడ్డు పక్కకు ఒరిగి పోయిన ఆర్టీసీ బస్సు

బురద రోడ్డులో ఒరిగిన ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలో నూతనంగా నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 516ఇ రహదారిపై కింద్ర జంక్షన్ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలుపుదల చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రహదారి నిర్మాణంలో భాగంగా సంబంధిత కాంట్రాక్టర్లు రహదారిపై కొత్తగా మట్టి వేయడంతో సోమవారం కురిసిన భారీ వర్షానికి ఆ మార్గం బుదరమయమైంది. రహదారి మీదుగా వచ్చే పోయే వాహనాల చక్రాలు జారిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఏలేశ్వరం నుండి రాజవొమ్మంగి వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుకు అవతల ఒరిగిపోయింది. డ్రైవర్ జాగ్రత్తగా నిలుపుదల చేయడంతో ప్రమాదం తప్పింది. అయితే చాలాసేపు రహదారిపై వాహనాలు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలు పడే క్రమంలో ఈ రహదారిపై ప్రయాణించే వాహనాలకు తరచూ ఇదే పరిస్థితి ఏర్పడుతుంది. వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందుల నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి సక్రమమైన సైడ్ డైవర్షన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని పలు సమస్యలపై స్పందన కార్యక్రమంలో సమర్పించే అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏడు అర్జీలు అందాయి. వీటిని పిఒ సూరజ్ గనోరే, ఎపిఒ సిహెచ్. శ్రీనివాసరావు స్వీకరించారు. గంగవరం మండలంలోని ఎండపల్లి రామవరం నుండి జడేరు వరకు, ఎండపల్లి నుండి గంగవరం వరకు, ఎండపల్లి రామవరం నుండి చిన్న అడ్డపల్లి వరకు బీటి రోడ్లు ఏర్పాటు చేయాలని దరఖాస్తులు వచ్చాయి. అడ్డతీగల మండలం బొడ్లంకలో తమ భూ సమస్య పరిష్కరించాలని సినతోజి సోమరాజు, వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలో బోర్లు మరమ్మతులు చేసినందుకుగాను తనకు రావలసిన రూ.37 వేలు మంజూరు చేయాలని చదల భరత్ కుమార్, గ్రామ సచివాలయాల సర్వేయర్లకు పని ఒత్తిడి తగ్గించాలని, అధికారుల నుండి ఇబ్బందులు పరిష్కరించాలని పి.లీలకృష్ణ, తురక దేవరత్నం, కారం జగదీశ్ దొర, కర్ర రాజశేఖర్ రెడ్డి దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్. ఎండి యూసఫ్, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, పిహెచ్ఓ కే చిట్టిబాబు, ప్రాజెక్ట్ ఆర్టికల్చర్ అధికారి రాంబాబు, సిడిపిఓ సంధ్యారాణి, ఏఎంవో సి.శ్రీహరి పలువురు అధికారులు పాల్గొన్నారు.


అరకులోయలో..


చింతూరులో...


అనంతగిరిలో...


హుకుంపేటలో..


కూనవరంలో..


మోతుగూడెంలో...

ప్రాణత్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షించుకోవడానికి ఐక్యఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని కార్మిక నేతలు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం, మేడే సందర్భంగా అనేక చోట్ల కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. జోరున కురుస్తున్న వర్షంలోనూ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి, మేడే స్ఫూర్తిగా కొనసాగించాలన్న నినాదాలతో ర్యాలీలు, ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకతను కార్మిక నేతలు వివరించారు.

- (ప్రజాశక్తి యంత్రాంగం)


ముంచంగిపుట్టులో...

అరుణ పతాక రెపరెపలు

పలుచోట్ల ఘనంగా మేడే వేడుకలు ... కార్మిక పతాకాన్ని ఆవిష్కరించిన నేతలు ... ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన కార్మికులు


మారేడుమిల్లిలో...


రాజవొమ్మంగిలో...


ఎటపాకలో...

పాడేరు డివిజన్‌లో....

దుంబ్రిగూడ: జోరున కురుస్తున్న వర్షంలోనూ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో మే డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్మికజెండాను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌పి పోతురాజు ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్న కార్మికచట్టాలను అమలుకు శ్రామికులంతా ఐక్యపోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల కార్యదర్శి ఎస్ గురిమిసింగ్, గ్రామ సేవకుల సంఘం నాయకుడు ఎస్ భీమన్న, హాస్టల్ వర్కర్లు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: మేడే సందర్భంగాకార్మిక పతాకాన్ని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకరరావు ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా నేత ఎం.ధర్మారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు భీమరాజు మాట్లాడుతూ ఎనిమిది గంటల పనిదినాల కోసం 136 ఏళ్ల క్రితం నిర్వహించిన కార్మికపోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు.కార్యక్రమంలో ఎంఎం శ్రీను, జి.నారాయణ, అంగన్వాడీ సంఘం నేత భవానీ, ఆశాలు, మాతృభాషా వాలంటీర్ల సంఘం నేతలు కె.కొండయ్య, కె.గణేశ్వరరావు, ముతా, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

పెదబయలు రూరల్: మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో కార్మిక జెండాను యూనియన్ మండల కమిటీ సభ్యులు చండా రామారావు ఆవిష్కరించారు. సిఐటియు మండల కార్యదర్శి కిల్లో సర్బన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బోండా సన్నిబాబు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కాలరాస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజా, కార్మిక వ్యతిరేక మతోన్మాద బిజెపిని గద్దె దింపాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొమ్మా పృధ్వీరాజు, సిఐటియు నాయకులు చండా రామారావు సునీల్, రాజు, ఆశ వర్కర్ యూనియన్ నేత సుబ్బలమ్మ, గ్రామ సేవకుల సంఘం నేతలు సుందర్‌దేవ్, హాస్టల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రామ్మూర్తి, అంగన్వాడి ఆటో కార్మికులు పాల్గొన్నారు

చింతపల్లి (పాడేరు) :చింతపల్లి మండలంలో కాఫీ కార్మికులు నివాసముంటున్న వంగసార కాలనీలో కార్మికులతో కలిసి మేడే సందర్భంగా సిఐటియు జెండాను కాఫీ కార్మిక సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు ఎన్ కనకవల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ కేరళ తరహాలో దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు రోజుకూలీ రూ.600లను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. కేంద్రంలో నరేంద్రమోడీ గద్దె దిగితే తప్ప దేశానికి, కార్మికుడికి న్యాయం జరగదన్నారు. కార్యక్రమంలో కాఫీ కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు కనకవల్లి సరస్వతి, జయ, ప్రియ పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంతోపాటు మెరకచింతలో భవన నిర్మాణ కార్మికుల యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షులు కాసుల సిద్దేశ్ ఆధ్వర్యంలో కార్మిక ఎర్రజెండాను ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా నేత సొంత్యాన హైమావతి మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 44కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్లుగా మార్చి, కార్మిక హక్కులను కాలరాయడంతోపాటు, యజమానులకు కట్టుబానిసలను చేస్తోందన్నారు. మండల పరిషత్ వైస్ ఎంపిపి సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే కార్మికులకు మెరుగైన జీవనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు,గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ ఎస్‌పిఎల్ ప్రమీల, నాయకులు మామిడి సూరిబాబు, వంతాల సత్తిబాబు, దాసరి సూరిబాబు, నతక నానిబాబు పాల్గొన్నారు.

అనంతగిరి : జోరు వానలోనూ మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. అంగన్వాడీ యూనియన్, సిఐటియు మండల అధ్యక్షులు పి.మంజుల ఆధ్వర్యాన కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ, మేడే స్ఫూర్తితో కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. బొర్రాలో గైడ్ యూనియన్, కాశీపట్నంలో జిసిసి గోదాం కళాసీల యూనియన్ ఆధ్వర్యంలో అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమ్మెల నాగులు, టోకూరు సర్పంచ్ కిల్లో. మొస్య, గిరిజన సంఘం నేత గెమ్మెల దేవన్న, ఎలక్ట్రికల్ యూనియన్ నేత అప్పలస్వామి. సత్యనారాయణ, హాస్టల్ వర్కర్స్ యూనియన్‌నేత గుండు, ఎంపిఎండిసి నేత సాగర చిన్నారావు, పాంగి రవిచంద్ర, అంగన్వాడీ కార్యకర్తలు కుమ్మరి చిలకమ్మ, శాంతి, కొండమ్మ, బొర్రాలో కిల్లో సోమేష్, రావుపల్లి నరసింహరాజు, జగన్నాథం, రామస్వామి, అప్పన్న పాల్గొన్నారు

అరకులోయ రూరల్: కార్మిక హక్కులు, చట్టాలు, కనీస వేతనాల అమలుకు మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటం ఉధృతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్ ప్రభుదాస్ అధ్యక్షతన కార్మికజెండాను సిఐటియు సీనియర్ నేత పాడి కొండలరావు ఆవిష్కరించారు. మండలంలో పద్మపురం గార్డెన్, కొత్తవలస గార్డెన్, ఏరియా ఆసుపత్రి, చొంపి, ఎండపల్లివలస, జిసిసి సోప్ యూనిట్, ఎపి టూరిజం, భవన నిర్మాణ కార్మిక సంఘాల కార్యాలయాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ కేంద్రంలో బీజెపి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు సింహాద్రి, రాజు, గోవిందరావు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, ఐటిడిఎ వర్కర్స్ యూనియన్ నేత పండు, మురళి, రాజు, భవన నిర్మాణం కార్మిక సంఘం నేత దాసుబాబు, కిలిబిలి, ఆసుపత్రి పారిశుధ్య కార్మికులు రఘు, బాలన్న పాల్గొన్నారు.

జిమాడుగుల : మేడే సందర్భంగా మండల కేంద్రంలో కార్మిక జెండాను అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు జి..మోదకొండమ్మ ఆవిష్కరించారు. . ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి జె. దీనబంధు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల ఉపాధ్యక్షుడు వి.మహేష్, కె.దేవినాయుడు, అంగన్వాడీ యూనియన్ మండల నేతలు టి.సత్యవతి, సత్యవతి, విఒఎలు ఆకాష్ సరస్వతి పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన..

జిమాడుగుల : ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పండుబాబు ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించారు యూనియన్ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం మన్మధరావు పాల్గొనగా, స్థానిక తహశీల్దార్ కార్యాలయ జంక్షన్ నుంచి మూడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఏజెన్సీలోని 11మండలాల ఎఐటియుసి నేతలు, హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో మేడే సందర్భంగా సిఐటియు జెండాను అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్. ముత్యాలమ్మ, జి.అచ్చియమ్మ ఆవిష్కరించారు. మేడే వర్ధిల్లాలి, ప్రపంచ కార్మికులరా ఐక్యం కావాలని నినదించారు. కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణకు ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నేత వై.అప్పలనాయుడు, విఒఎ నేత మల్లేశ్వరరావు, దొడ్డవరం విఒఎ, సిఎంపి మండల కమిటీ సభ్యులు నర్సి జయలక్ష్మి, బుజ్జిబాబు, కాకర చిన్నారావు పాల్గొన్నారు.

రంపచోడవరం డివిజన్‌లో....

రాజవొమ్మంగి : మేడే స్ఫూర్తితో కార్మిక సమస్యలు పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు పిలుపునిచ్చారు. స్థానిక విఘ్నేశ్వర తాపీ మేస్త్రిల సంఘం సమావేశ మందిరంలో కార్మికజెండాను సిఐటియు నేతలు అచ్చారావు, వెంకటలక్ష్మి ఆవిష్కరించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నాయకులు రామరాజు శ్రీను, వీరబాబు, రాంబాబు, అంగన్వాడీ, తాపీ మేస్త్రీ, ఎలక్ట్రికల్, కార్పెంటర్ యూనియన్ నేతలు రామకృష్ణ, నాగు, శ్రీను, నాగు, ప్రసాద్, రమణి, కుమారి, రత్నం, వీరయ్యమ్మ పాల్గొన్నారు.

కూనవరం : మండల కేంద్రంలో బస్‌స్టాండ్ ప్రాంగణంలో సిఐటియు నేత, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య కార్మికజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోలవరం నిర్వాసితులు, ముంపు బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సిపిఎం నేతలు తలగాని నాగరాజు, షణ్ముఖరావు, జక్కుల ఏసుబాబు, తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్, సుధారాణి, కర్నాటి శ్రీనివాసరావు, బాబు బొర్రయ్య, అంగన్వాడీలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **ఎటపాక:**. సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో మండలంలో 62 కేంద్రాల్లో మే డే సందర్భంగా కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ బూర్జువా పాలక వర్గాలు కార్పొరేటుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిపోయాయని విమర్శించారు. శ్రామికులందరూ ఏకమై పోరాడి కోల్పోతున్న హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.మాధవరావు, ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్‌కుమార్, ఐ పద్మ, కాకా అర్జున్, బుద్ధుల భద్రయ్య, ఇరపా సత్యం, సవలం రాము, పొడియం రత్నరావు, లవన్ చంద్ర, వీరమ్మ, సొందె రామారావు, కారం రత్తమ్మ, పులుసు సూర్యనారాయణ, కందుల సతీష్ పాల్గొన్నారు.

చింతూరు :ప్రపంచ కార్మిక దినోత్సవం, మే డే పురస్కరించుకొని ఎర్రంపేట జిసిసి సెంటర్ నుంచి సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. చింతూరు సెంటరు వద్ద కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నేతలు పండా కృష్ణయ్య పోదయం లక్ష్మణ్, సీసం సురేష్, ఎర్రం శెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గడచిన తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, మోడీ అనుచరులైన అంబానీ, ఆదానీ, మరో 18మంది నేతలకు దేశసంపదను దోచిపెడుతోందన్నారు. సిపిఎం నేతలు కుంజా సీతా రామయ్య, ముట్టుం రాజయ్య, కారం సుబ్బారావు, పాండు నాగార్జున, కారం కొండయ్య కారం, రాజయ్య, బుగ్గ ముత్తయ్య, బ్రహ్మయ్య, కవిత, ముత్తమ్మ, దుర్గ, రాములమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెంలో సిఐటియు కార్యాలయంలో కార్మికజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బివి.రమణ, రత్నాకర్, చింత రాంబాబు మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, కార్మిక కర్షక, అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ప్రభుత్వాలకు గుణపాఠం చెపాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.

సీలేరు : సీలేరులో 1104 కార్యాలయం వద్ద కార్మికజెండాను జెన్‌కో కార్మికసంఘం నేత వై .సత్తిబాబు శివప్రసాద్, వై. నాగరాజు ఆవిష్కరించారు. కార్మికనేత సత్తిబాబు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనకు ఐక్యపోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్మికులకు అక్కడి ఇంజినీర్లు పరస్పరం మేడే శుభాకాంక్షలు చెప్పుకున్నారు ఎపి జెన్‌కో కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మే డే సందర్భంగా జిసిసి కార్మికుల ఆధ్వర్యంలో కార్మిక పతకాన్ని ఆవిష్కరించారు. గిరిజన సంఘం నాయకులు సిరిమల్లి రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావుల ప్రాణత్యాగం, పోరాట ఫలితమే నేడు కార్మికులకు అనేక హక్కులు కల్పించబడ్డాయన్నారు. నేటి ప్రభుత్వాలు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. డిసిసి కార్మికులు అప్పారావు, శ్రీను, రాంబాబు పాల్గొన్నారు.


పాడేరులో..


దుంబ్రిగుడలో..


జి.మాడుగులలో...


కొయ్యూరులో...


పెదబయలులో...


విఆర్.పురంలో...


రేషన్ డీలర్ల చేతివాటం!

- ప్రతినెలా పక్కదారి పడుతోన్న పేదల బియ్యం
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణం
- బాధ్యులపై చర్యలకు గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హుకుంపేట: రెవెన్యూ, జిసిసి, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ లోపం కారణంగానే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్రం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఉచిత రేషన్ బియ్యం పథకం మారుమూల గ్రామాల్లో ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కావటం లేదు. పక్క్ ప్లానింగ్‌తో రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న డీలర్ల బాగోతం మండలంలోని పట్టం పంచాయతీ డిఆర్ డిపోలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలు గ్రామాల్లో ఇలాగే రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి.

మార్చి నెల ఉచిత బియ్యాన్ని కొద్దిమంది కార్డుదారులకే పంపిణీ చేసి చేతులు దులుపుకున్న డీలర్లు, ఏప్రిల్ నెలలో బియ్యాన్ని పంపిణీ చేశారు. దీంతో తమకు మార్చి నెల బియ్యం ఎందుకు ఇవ్వలేదని కొంతమంది కార్డుదారులు డీలర్లను ప్రశ్నించగా, వచ్చేనెల వస్తుందని, అపుడు ఇస్తామని సమాధానం దాటవేశారని కార్డుదారులు ఆరోపిస్తున్నారు. దీంతో బాధితులు ఉన్నతాధికారులను సంప్రదించగా, బురువలస, గంగూడి తదితర గ్రామాల్లో చాలా మంది బాధితులు ఉన్నపటికీ, వెలుగులోకి వచ్చిన సమాచారం ఆధారంగా 14 మంది కార్డుదారులకు చెందిన 350 కేజీల వరకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయలేదని తెలుస్తోంది. అయితే ఆయా కార్డుదారులకు మార్చినెలలోనూ రేషన్ బియ్యం పంపిణీ జరిగినట్లు వారికి ఇచ్చిన అనధికార కార్డుస్లిప్పులపై నమోదు చేయడంతో విస్తుపోయిన వారంతా రేషన్ డీలర్‌ను నిలదీశారు. అయితే అనధికార స్లిప్పుల్లో ఇచ్చినట్లు నమోదు చేయడం ద్వారా, కార్డుదారులకు రావాల్సిన బియ్యాన్ని వారికి ఇవ్వకుండా డీలరు వెనకేసుకున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత జిసిసి, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగానే డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, రేషన్ బియ్యాన్ని కార్డుదారులకు ఇవ్వకుండా పక్కదారి పట్టించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

గతంలోనూ ఇలాగే 50మంది కార్డుదారులకు చెందిన రేషన్ బియ్యాన్ని వారికి పంపిణీ చేయకపోవడంతో, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు స్పందించి, రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇపుడు మరోమారు అలాగే అనేకమంది కార్డుదారుల బియ్యాన్ని ఇవ్వకుండా స్వాహా చేశారని కార్డుదారులు మండిపడుతున్నారు. పదేపదే ఇలా జరుగుతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తుండడంపై కార్డుదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే కేంద్రం ప్రకటించిన కోటా బియ్యాన్ని మాత్రమే కార్డుదారులకు అందజేస్తూ, రాష్ట్రకోటాకు పూర్తిగా మంగళం పాడేశారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఆ బియ్యాన్ని కూడా పేదలకు అందకుండా డీలర్లు చేతివాటం ప్రదర్శించడంపై ఆందోళన వ్యక్తమౌతోంది. రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని మైదానప్రాంత మిల్లులకు తరలించి, వాటిని పాలిషింగ్ చేయించి, సన్నబియ్యంగా మార్చి అధికధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలపై పటిష్టనిఘా పెట్టి, కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


బియ్యం పంపిణీ చేసినట్లు అనధికారిక కార్డులో నమోదు చేసిన డీలరు

పర్యవేక్షణ లోపం వల్లే పక్కదారి : గిరిజన సంఘం

నిరుపేద గిరిజనులకు అందాల్సిన రేషన్ బియ్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే అందకుండా పక్కదారి పడుతోందని గిరిజన సంఘం కార్యదర్శి తాపుల కృష్ణారావు ఆరోపించారు. ప్రతినెలా ఏదోచోట రేషన్‌బియ్యం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటుండడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మండలంలో ఇలాంటి అక్రమాలు జరగడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించి రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్న డీలర్లపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రజాశక్తి' ఆధ్వర్యాన మేడే సంబరాలు

ప్రజాశక్తి - విశాఖపట్నం

ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కేంద్రంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత ఎర్రజెండాను స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ఎగురవేశారు. సిబ్బంది మేడే ప్రతిజ్ఞ చేశారు. కార్మిక దినోత్సవం ప్రాధాన్యతను వక్తలు వివరించారు. అనంతరం తలపెట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్, కప్పగంతులు, అంత్యాక్షరి పోటీల్లో ప్రజాశక్తి కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పత్రిక ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఎంవిఎస్.శర్మ బహుమతులు అందజేశారు. ప్రజాశక్తి సిబ్బంది, తమ కుటుంబ సభ్యులతో రోజంతా ఈ వేడుకలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి రామస్వామి


మాట్లాడుతున్న ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు ఎంవిఎస్.శర్మ